సాక్షి
కుమురం భీం
శనివారం । 28 । జనవరి । 2023



జనసంద్రంగా నాగోబా

కేస్లాపూర్‌లోని నాగోబా జాతర భక్తజనసంద్రంగా మారింది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. 10లో▸



సరస్వతీ అమ్మవారికి లక్ష్మీకటాక్షం

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారికి వసంత పంచమి సందర్భంగా గురువారం ఒక్క రోజే రూ.71.91 లక్షల ఆదాయం సమకూరింది. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0 /16.0

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రి వేళలో చలి ప్రభావం కొనసాగనుంది.

న్యూస్‌రీల్

డిగ్రీ విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశం పొందిన డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తుదురు దత్తాత్రేయ ఒక ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 6లోగా రూ.500 అపరాధ రుసుంతో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని, ఫీజు చెల్లించని విద్యార్థులు పరీక్షలు రాయడానికి అనర్హులన్నారు. వివరాలకు 9866398678 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులు పరిశీలన



శ్మశానవాటికను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పెంచికల్‌పేట్(సిర్పూర్): బొంబాయిగూడ గ్రామ పంచాయతీలో డీఎల్‌పీవో సురేశ్‌బాబు శుక్రవారం పర్యటించారు. శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. అనంతరం వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు పంచా యతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాసింగ్ ఉన్నారు.


చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెజ్జూర్(సిర్పూర్): చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ రాజుల నాయుడు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా శుక్రవారం బెజ్జూర్ మండలంలోని సోమినిలో చిరుధాన్యాల పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో పాటు తక్కువ కాలంలో అధిక లాభాలు గడించవచ్చన్నారు. చిరుధాన్యాల్లో కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్, మినరల్స్, విటమిన్లు మెండుగా ఉంటాయన్నారు. మాంసాహారంతో పోల్చితే చిరుధాన్యాల్లో ప్రొటీన్, ఐరన్ ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతీరోజు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఎముకలు కూడా దృఢంగా ఉంటాయని, గుండె, క్యాన్సర్ జబ్బులు రావన్నారు. సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ దుర్గం శంకర్, ఎంపీటీసీ ఆత్రం సాయన్న, ఏఈఓ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

పదోన్నతుల జాబితాలో తప్పులు సవరించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితాలో తప్పులు సవరించాలని కోరుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు డీఎస్సీలో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీనియారిటీ జాబితా విడుదల చేయాలన్నారు. ఇంక్రిమెంట్, సర్వీస్ కలిపి పదోన్నతులు, అంతర్ జిల్లా పరస్పర బదిలీలు పొందిన తేదీ నుంచి లెక్కించాలని, ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసి పదవీ విరమణకు మూడేళ్ల లోపు ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను రిమార్క్‌ సందు సూచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పదోన్నతుల ప్రక్రియ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోందని డీఈవో అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్జీటీల నుంచి ఎస్‌ఏలుగా పదోన్నతుల కోసం సుమారు 160 ఖాళీలు ఉండగా 500 దరఖాస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు, సర్వీసు పుస్తకాలను పరిశీలించినట్లు తెలిపారు. 1:3 ప్రకారం సీనియార్టీ లిస్టును తయారు చేయడం జరిగిందని, వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 వరకు పరిశీలించుకునే అవకాశం ఉంటుందన్నారు.

రేషనలైజేషన్ ఆలస్యం

- జీపీలు ఏర్పడి నాలుగేళ్లయినా తప్పని తిప్పలు
- రేషన్ కార్డుల్లోనూ మారని ఊరిపేర్లు
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు



రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పదేళ్ల క్రితం జరిగిన రేషన్ దుకాణాల రేషనలైజేషన్‌తో ఏర్పాటైన చౌక ధరల దుకాణాలతోనే రేషన్ బియ్యం పంపిణీ కొనసాగుతోంది. పెరుగుతున్న జనాభా, రేషన్ కార్డులతో పాటు కొత్త షాపులను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ ఆదిశగా ప్రయత్నాలు జరగడంలేదు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు రేషన్ బియ్యం కోసం ప్రతీనెల కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగేళ్ల క్రితం ఏర్పాటైన నూతన గ్రామ పంచాయతీల్లోనూ రేషన్ షాపులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉచితంగా వచ్చిన రేషన్ బియ్యం తెచ్చుకునేందుకు రూ.50 నుంచి రూ.100 వరకు రవాణా ఖర్చులు అవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతదూరం వెళ్లలేనికొంతమంది వృద్ధులు బియ్యం తీసుకోలేకపోతున్నారు.

నిబంధనలు ఇలా..

కొత్త రేషన్ షాపు ఏర్పాటు చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లోనైతే 500 రేషన్ కార్డులు, మూడు కిలోమీటర్ల దూరం, పట్టణ ప్రాంతాల్లోనైతే 600 నుంచి 800 రేషన్ కార్డులకు ఒకషాపు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 300 రేషన్ షాపులు కొనసాగుతున్నాయి. పదేళ్లుగా రేషన్ కార్డుల సంఖ్య పెరగడం, గ్రామాలు విస్తరించినా నూతనంగా ఇంతవరకూ కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేయలేదు. ఆర్నెళ్లక్రితం ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను కూడా జారీ చేసింది. దీంతో షాపుల వద్ద లబ్ధిదారుల సంఖ్య ఎక్కువ ఉండడంతో గంటల తరబడి క్యూలో వేచి చూడాల్సిన పరిస్థితి.

జిల్లాలో రేషన్ షాపుల వివరాలు

ఆసిఫాబాద్	32
బెజ్జూర్	16
దహెగాం	17
జైనూర్	21
కాగజ్‌నగర్	57
కెరమెరి	18
కౌటాల	20
రెబ్బెన	21
సిర్పూర్(టి)	16
వాంకిడి	15
సిర్పూర్(యూ)	8
తిర్యాణి	20
చింతలమానెపల్లి	17
మొత్తం:	300

ప్రతిపాదనలు పంపించాం

జిల్లాలో 38 రేషన్ షాపులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మంజూరు కాగానే కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం జిల్లాలో 300 రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నాం.

– తారామణి, డీఎస్‌వో, ఆసిఫాబాద్

‘మన ఊరు–మన బడి’తో విద్యారంగం బలోపేతం

- విద్యాశాఖ రాష్ట్ర సంచాలకులు వాకాటి కరుణ
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వాకాటి కరుణ

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా విద్యారంగం బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు వాకాటి కరుణ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేనతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకాటి కరుణ మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మొదటి విడతలో గుర్తించిన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో భాగంగా సీనియారిటీ, ఖాళీల జాబితాలను రూపొందించి నివేదిక అందించాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మొదటి విడతలో జిల్లాలోని 15 మండలాల్లో గుర్తించిన 28 పాఠశాలల్లో సివిల్ పనులు పూర్తికాగా 14 పాఠశాలల్లో ప్రహరీ, మూత్రశాలలు, డ్యూయల్ బెంచీలు, తాగునీరు, పెయింటింగ్, విద్యుత్, తదితర పనులు పూర్తయ్యాయన్నారు. ఈ నెల 31లోగా ప్రారంభానికి సిద్ధంగా ఉంచామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

- జెడ్పీచైర్‌పర్సన్ కోవ లక్ష్మి



భీమన్న ఆలయంలో పూజలు చేస్తున్న కోవ లక్ష్మి

తిర్యాణి(ఆసిఫాబాద్): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుఅన్నారు. మండలంలోని సుంగాపూర్ భీమన్న ఆలయంలో శుక్రవారం సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, వాటిని కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని స్వదినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. భీమన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆత్రం లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యుడు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపకార వేతనం అందాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని గిరిజన, మైనార్టీ, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖల పరిధితో పాటు ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థులందరికీ ఉపకారవేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 23లోగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల వివరాలు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఎంసెట్ విద్యార్థులకు శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో డీఐఈవో శ్రీధర్ సుమన్, డీఈవో అశోక్, డీటీడీవో మణెమ్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మైఖేల్‌యార్క్ సేవలు మరువలేనివి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో

తిర్యాణి(ఆసిఫాబాద్): ఆదివాసీలు విద్యావంతులు కావాలని ప్రొఫెసర్ మైఖేల్‌యార్క్ చేసిన సేవలు మరువలేనివని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గిన్నెదరిలో శుక్రవారం నిర్వహించిన మైఖేల్‌యార్క్ 72వ జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిన్నెదరిలో టీచర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఎంతోమందిని విద్యావంతులుగా మలిచిన ఘనత మైఖేల్ యార్క్‌కు దక్కుతుందన్నారు. త్వరలో గిన్నెదరిలో మైఖేల్ యార్క్ స్టడీ సెంటర్, మినీ మ్యూజియం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంప్రదాయాలకు చెందిన వెలిశాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, ఆదివాసీ సంఘం జాతీయ నాయకుడు సిడాం అర్జు మాస్టర్, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, రాయి సెంటర్ జిల్లా సర్‌మెడి కుర్సింగ మోతిరాం, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి, న్యాయవాది పెందుర్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో ఫిబ్రవరి 11న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ సూచించారు. శుక్రవారం కోర్టు హాలులో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ ఉమా మహేశ్వరితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేసులపై పోలీసు అధికారులతో చర్చించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

ఆసిఫాబాద్‌అర్బన్: భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాజేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సప్త బాలకిషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ.54వేల నష్ట పరిహారం నిధులను మంజూరు చేయాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు, సహజ మరణాలకు రూ.5లక్షలు, దహన సంస్కారాలు, వివాహ, ప్రసూతి ఖర్చులకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, కార్యదర్శి దూడల అశోక్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి కమలాకర్, మండల అధ్యక్షుడు రాంచందర్, నాయకులు సదయ్య, ఆనంద్‌రావ్, సుభాష్, ఆశన్న, నరేశ్, రాజన్న, మనోహర్, ఉద్దవ్, శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అక్రమాలకు చెక్

- ఆధార్‌తో జాబ్‌కార్డుల అనుసంధానం
- పెరుగనున్న పారదర్శకత



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

తిర్యాణి(ఆసిఫాబాద్): గ్రామాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వంకు చెందిన సాఫ్ట్‌వేర్ ద్వారా పనులు చేపట్టేవారు. జాతీయస్థాయిలో ఒకే సాఫ్ట్‌వేర్ ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పనుల నిర్వహణకు గతేడాది నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. దీంతో అప్పటి నుంచి ఉపాధిహామీ పనుల్లో పలు ప్రక్షాళనలు జరుగుతున్నాయి. అంతేకాకుండా ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూలీల ఆధార్‌కార్డుతో జాబ్‌కార్డులను అనుసంధానం చేస్తున్నారు.

ఆధార్‌తో అనుసంధానం

జిల్లాలోని 15 మండలాల్లో 1,29,170 మంది ప్రజలు ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగిఉన్నారు. ఒక్కో కుటుంబానికి ఒక్కో జాబ్‌కార్డును మాత్రమే ఇస్తారు. 1,29,170 జాబ్‌కార్డుల్లో 2,74,166 మంది కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు 2006 సంవత్సరంలో జాబ్‌కార్డులను అందజేశారు. ఆ సమయంలో ఒక కుటుంబం పేరిట రెండు జాబ్‌కార్డులు సైతం నమోదయ్యాయి. తద్వారా పథకంలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి. అంతేకాకుండా ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్న వారికి సైతం జాబ్‌కార్డులు ఉండటం, ఒక్కొక్కరికి రెండుచోట్ల జాబ్‌కార్డులు ఉండడం, కొన్నిచోట్ల జాబ్‌కార్డులో ఒకపేరు, ఆధార్‌కార్డులో మరోపేరు ఉండడంతో వేతన చెల్లింపుల్లో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆధార్‌కార్డుతో జాబ్‌కార్డుకు లింక్ చేయడానికి శ్రీకారం చుట్టింది. దీంతో వేతన చెల్లింపుల్లో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ఉండటంతో పాటు అర్హులకు పని కల్పించేందుకు వీలు కలుగుతుంది. ఈ నేపథ్యంలో జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీల వద్ద నుంచి ఆధార్, జాబ్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, తదితర వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం

వందశాతం జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలని ఆదేశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ సిబ్బంది కూలీల వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఆధార్ కార్డు, జాబ్‌కార్డు జిరాక్స్‌లను తీసుకుంటూ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

– శ్రావణ్ కుమార్, ఏపీవో, వాంకిడి

మండలాల వారీగా జాబ్ కార్డులు, కూలీల వివరాలు

మండలం	జాబ్‌కార్డులు	కూలీలు
తిర్యాణి	7,788	16,220
ఆసిఫాబాద్	11,931	24,506
కెరమెరి	9,772	20,671
రెబ్బెన	10,129	22,365
సిర్పూర్(టి)	7,624	15,854
వాంకిడి	11,259	22,119
బెజ్జూర్	9,359	19,279
దహెగాం	7,856	18,222
జైనూర్	9,159	19,829
కాగజ్‌నగర్	13,903	26,608
కౌటాల	9,297	21,063
సిర్పూర్(యూ)	4,036	9,001
చింతలమానెపల్లి	8,121	18,812
లింగాపూర్	4,441	9,850
పెంచికల్‌పేట్	4,495	9,872

అండర్‌పాస్‌ను పరిశీలించిన ఎన్‌హెచ్ అధికారి



గ్రామ పంచాయతీ తీర్మాన ప్రతిని అందిస్తున్న నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా వాంకిడి మండల కేంద్రంలో నిర్మిస్తున్న అండర్ పాస్ వివాదంగా మారిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం ఎన్‌హెచ్‌ఏఐ పీడీ రవీందర్ అండర్‌పాస్‌ను పరిశీలించి స్థానిక నాయకులతో మాట్లాడారు. ఇంజినీరింగ్ ప్రణాళిక ప్రకారంగానే నిర్మాణం జరుగుతోందని, ప్రజల డిమాండ్ మేరకు మళ్లీ పరిశీలించి తదుపరి ప్రణాళిక వెళ్లడిస్తామన్నారు. అప్పటి వరకు రహదారి పనులు మాత్రమే కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బండె తుకారాం, జెడ్పీటీసీ అజయ్ కుమార్, వివిధ సంఘాల నాయకులు కలిసి గ్రామ పంచాయతీలో తీర్మానించిన పత్రాలను పీడీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెంటు, సర్పంచులు కిష్టు, పవన్, మనోహర్, అశోక్ మహోల్కర్, జైరాం, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బంబారలో అండర్‌పాస్ నిర్మించాలి

మండలంలోని బంబార మీదుగా నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారిపై అండర్‌పాస్ నిర్మించాలని కోరుతూ ఉప సర్పంచ్ బోయిరె ప్రకాష్ పీడీ రవీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. బంబార గ్రామం రోడ్డుకు ఇరువైపులా ఉన్నందువల్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. యూటర్న్ సైతం గ్రామానికి దూరంగా ఇవ్వడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ కోట్నాక నేపాజీ, వార్డుసభ్యుడు సెండె రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకే విద్యార్థి.. ముగ్గురు సిబ్బంది


పరీక్ష రాస్తున్న విద్యార్థి, విధుల్లో సిబ్బంది

రెబ్బెన(ఆసిఫాబాద్): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా రెబ్బెన మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో శుక్రవారం విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం 5వ సెమిస్టర్ పరీక్ష నిర్వహించగా కేవలం ఒకే విద్యార్థి మాత్రమే పరీక్షకు హాజరు కాగా నిర్వహణ కోసం ముగ్గురు సిబ్బంది విధులు నిర్వహించారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్‌గా మోహన్, చీఫ్ సూపరింటెండెంట్‌గా జాకీర్ ఉస్మానితో పాటు ఒక ఇన్విజిలేటర్ ఉన్నారు.

కోలిండియా వాలీబాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక

మందమర్రిరూరల్: ఈ నెల 30, వచ్చే నెల 1న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే కోలిండియా వాలీబాల్ పోటీలకు మందమర్రి ఏరియా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆర్కే–1 గనిలో ట్రామర్‌గా విధులు నిర్వహించే ఎస్.రమేష్, సివిల్ విభాగంలో విధులు నిర్వహించే వి.రాములు ఎంపిక కాగా వీరిని శనివారం నుంచి రిలీవ్ కావాల్సిందిగా జీఎం శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు.

కాంగ్రెస్‌లో నాతరి స్వామి చేరిక


కాంగ్రెస్‌లో చేరిన స్వామి, అతడి అనుచరులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన న్యాతరి స్వామి అతడి అనుచరులతో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరాడు. ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ కె.ప్రేమ్‌సాగర్‌రావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కొద్ది రోజుల నుంచి స్వామి రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న స్వామి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఓ మాజీ ప్రజాప్రతినిధి ఆశీస్సులతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఎట్టకేలకు లిఫ్టు నీళ్లువచ్చాయి!


ప్రధాన కాల్వలోకి గూడెం ఎత్తిపోతల నీళ్లు

దండేపల్లి: గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం మరమ్మతులు గురువారం సాయంత్రం పూర్తవడంతో రాత్రి 8:30 గంటలకు మోటార్లు ఆన్‌చేయగా, రాత్రి 11:15 గంటలకు సాగు నీరు తానిమడుగు వద్ద గల ఎత్తిపోతల డెలివరీ పాయింట్ నుండి కడెం ప్రధాన కాల్వలోకి చేరాయి. ఎత్తిపోతల ద్వారా ప్రస్తుత యాసంగి పంటలకు సాగు నీరందించేందుకు, గత నెల డిసెంబర్ 29న నీటిని విడుదల చేశారు. నీటి విడుదల చేసి గురువారం నాటికి 30 రోజులు గడిచాయి. అందులో పైప్‌లైన్ మూడు చోట్ల లీకవడం, రెండు సార్లు కరెంట్ సమస్యలతో మోటార్లు నడవలేదు. దీంతో నీటి సరఫరాకు 25 రోజులు అంతరాయం ఏర్పడింది. నీటిని విడుదల చేసినప్పటి నుంచి నీటి సరఫరా జరిగింది మాత్రం 5 రోజులే. ఎట్టకేలకు మరమ్మతులు పూర్తికావడంతో గురువారం రాత్రి నుంచి ఎత్తిపోతల పథకం ఒక్క మోటారు ద్వారా సాగునీటి సరఫరా కొనసాగుతోంది. పైప్‌లైన్లలో ఉన్న ఎయిర్ పూర్తిగా బయటికి వెళ్లిన తర్వత పరిశీలించి రెండో మోటార్ ఆన్ చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

‘ఆదర్శం’ పిలుస్తోంది..

- మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు
- ఫిబ్రవరి 15 చివరి తేదీ
- 6వ తరగతిలో ఉమ్మడి జిల్లాలో 1400 మంది విద్యార్థులకు అవకాశం
- ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష



ఆసిఫాబాద్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు ప్రకటన వెలుబడింది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభావంతులైనా నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యకు ఈ పాఠశాలు దోహద పడనున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితం ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 2013లో ఆదర్శ పాఠశాలను నెలకొల్పింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ (యూ), మందమర్రి, మంచిర్యాల్, కుంటాల, కోటపెల్లి, కాసిపేట్, దండేపల్లి, నార్నూర్, గుడిహత్నూర్, జైనథ్, బోథ్, ఆదిలాబాద్ (బంగారుగూడ), బజార్‌హత్నూర్‌లో ఈ పాఠశాలలు ఉన్నాయి.

సీట్ల కేటాయింపు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలో 6వ తరగతిలో 14వందల మంది విద్యార్థుల ప్రవేశం ఉంటుంది. దీంతోపాటు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2022–23 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది మధ్యలో వివిధ కారణాలతో మానివేసిన ఖాళీ సీట్ల ప్రవేశం కోసం అవకాశం ఉంటుంది. ప్రవేశాలు రోస్టర్ పద్ధతిలో నిర్వహిస్తారు. 100 సీట్లలలో ఎస్సీ విద్యార్థులకు 15 శాతం, ఎస్టీ విద్యార్థులకు 6శాతం, బీసీ విద్యార్థులకు 29శాతం ఉంటాయి. ఇందులో (బీసీ ఎ–7) (బీసీ బి–10) (బీసీ సీ–1)(బీసీ డి–7)(బీసీ ఈ–4)తో పాటు ఓపెన్ కేటగిరీలో 50 సీట్లను భర్తి చేయనున్నారు. అన్నీ కేటాగిరీలోనూ బాలికలకు 33 శాతం, 3శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించనున్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు ఇలా..

ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వైబ్‌సైట్ వైబ్‌సైట్ http//telanganams.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి పాస్‌ఫోటో, ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బోనఫైడ్ జిరాక్స్ పత్రాలు ఏ పాఠశాల ప్రవేశం కోసం నమోదు చేసుకున్నామో ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలి.

ప్రవేశ పరీక్ష విధానం

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్షని అబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఐదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25ప్రశ్నలు ఇస్తారు.

మోడల్ స్కూల్ ప్రత్యేకత...

- 6 నుంచి 10వ తరగతి వరకు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా బోధన
- ఆంగ్ల మాధ్యమంలో విద్య
- పక్కా భవనంతో తరగతి గదులు

ఫిబ్రవరి 15 తుది గడువు

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కోసం జనరల్ కేటాగిరీ విద్యార్థులకు రూ.200 ఈడబ్ల్యూఎస్ దివ్యాంగుకలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 8వ తేదీ నుంచి 12వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుంది.

లోకల్ విద్యార్థులకు ప్రాధాన్యత



ఆదర్శ పాఠశాలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో 6వ తరగతిలో 100 సీట్లు మిగితా 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేస్తాం. లోకల్ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తాం.
– అబ్దుల్ ఖలీల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్

- 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వమే పుస్తకాలను అందజేస్తుంది.
- సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ సదుపాయం.
- నాణ్యమైన మధ్యాహ్నభోజనం, పౌష్టికాహారం అందజేత.
- 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలకు ప్రతిభ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- 10వ తరగతి విద్యార్థులకు ఎన్‌టీఎస్ఎకు ప్రత్యేక శిక్షణ తరగతులు

టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


జెండాను ఎగురవేస్తున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్ వద్ద శుక్రవారం టీబీజీకేఎస్ 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు జెండాను ఎగురవేశారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ కోసం చేపట్టిన ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర ఎనలేనిదన్నారు. సింగరేణిలో టీబీజీకేఎస్ యూనియన్ మూలంగానే కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం దేశంలోని ఏ బొగ్గు కంపెనీలో లేని విధంగా సింగరేణి కార్మికులకు అనేక హక్కులను సీఎం కేసీఆర్ కల్పించారన్నారు. సింగరేణిని అనునిత్యం కాపాడుకుంటూ కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా టీబీజీకేఎస్ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో యూనియన్ చర్చల ప్రతినిధి మంగీలాల్, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు సదాశివ్, సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, నాయకులు మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, నాయకులు సాంబగౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరాహార దీక్ష


నిరాహార దీక్ష చేస్తున్న శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, బోనస్‌లు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలో అసిస్టెంట్ లేబర్ కమీషనర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ పవర్‌ప్లాంట్ పవర్‌పర్చేజ్ అగ్రిమెంటు ముగిసిన తర్వాత తమకు నాలుగు నెలల వేతనాలు, మూడేళ్ల బోనస్‌లు కంపెనీ యాజమాన్యం ఇవ్వడం లేదన్నారు. తమకు రావాల్సిన బకాయిలు ఇవ్వాలని రెండు నెలలుగా కంపెనీ యజమాన్యానికి వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వారికి బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, తులా మధుసూధన్, బీఎంఎస్ సంఘం నాయకులు రాజు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జైపాల్‌సింగ్, దేవిసత్యం, సీఐటీయూ నాయకులు సంకే రవి, ప్రకాష్, బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు కాదాసి రవీందర్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మాజీ అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్, చెట్టి శ్రీనివాస్, కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఆనందరావు, కార్యదర్శి నిమ్మరాజుల సత్యం, నాయకులు కాయితి శ్రీనివాస్, బుచ్చయ్య, శంకర్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం, ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలి


ధర్నాలో ఆదివాసీ సంఘాల నాయకులు

కాసిపేట: దేవాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆశ్రమ పాఠశాల ఎదుట శుక్రవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్నారంలో పట్టుబడిన బియ్యం దేవాపూర్ ఆశ్రమ పాఠశాలకు చెందినవి అయినప్పటికీ ఏటీడీఓ, డీటీడీఓలు పట్టించుకోకుండా విచారణ పేరుతో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో 21.80 క్వింటాళ్లు ఉండాల్సి ఉండగా కేవలం 11క్వింటాళ్ల బియ్యం మాత్రమే ఉన్నాయన్నారు. హాస్టల్‌ను సందర్శిస్తే కనీసం హెచ్‌ఎం అందుబాటులో లేడని ఏటీడీఓ, డీటీడీఓలు సైతం దాటవేసే సమాధానాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే హెచ్‌ఎంతో పాటు ఏటీడీఓ, డీటీడీఓను సైతం విధుల నుంచి తొలగించాలని గిరిజనుల కడుపు కొడుతూ నిధులు దుర్వినియోగం చేయడం, బియ్యం, వంట సామగ్రి పక్కదోవ పట్టిస్తున్నారని అధికారులతో సంబంధం ఉండడంతో హెచ్‌ఎం భయం లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. హాస్టల్, పాఠశాలను సక్రమంగా నడిపేలా చూడాలని , మెనూ పాటించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీవోకు ఫోన్‌లో మాట్లాడగా సస్పెండ్ చేయనున్నట్లు తెలుపడంతో సాయంత్రం ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడ జంగు, జిల్లా అధ్యక్షులు మడావి వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ పేంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెడ్మ కిషన్, ఆదివాసీ సంఘాల నాయకులు కనకరాజు, మడావి అనంతరావు, ఆత్రం జంగు, మడావి వెంకటేష్, పేంద్రం ప్రభాకర్, సిడాం గణపతి, పేంద్రం శంకర్ పాల్గొన్నారు.

హాజీపూర్ మండలంలో శిక్షణ కలెక్టర్ గౌతమి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో పంచాయతీ రాజ్, మండల పరిషత్‌లపై పూర్తిస్థాయి అవగాహన కోసం శిక్షణ కలెక్టర్ గౌతమి శుక్రవారం నుంచి నెలరోజుల పాటు పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టనున్నారు. కలెక్టర్ భారతీ హోళ్లీకేరీ ఆదేశాల మేరకు జిల్లాలో హాజీపూర్ మండలం శిక్షణ కలెక్టర్ గౌతమి నెల రోజుల పాటు శిక్షణకు నియమించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలోని పంచా యతీల్లో సర్పంచ్, కార్యదర్శుల విధులు, పంచా యతీల్లో చేపట్టే ప్రభుత్వ పథకాలతో పాటు నర్సరీ లు, శ్మశాన వాటికలు, డంప్‌యార్డులు, క్రీడాప్రాంగణాలు తదితర అంశాలను పర్యవేక్షించడం, క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహనకు రానున్నారు. ఎంపీపీ విధుల తో పాటు మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకోనున్నారు. ఈ క్రమంలో ఎంపీడీవో అ బ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాసరెడ్డిలు శిక్షణ కలెక్టర్ గౌ తమికి పంచాయతీరాజ్ వ్యవస్థలోన్ని ప్రధాన అంశాలను వివరించారు. నెల రోజుల పాటు మండలంలోని గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి మరింత అవగాహన పెంచుకోనున్నారు.

ఎస్జీటీలకు అవకాశం కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: స్పౌజ్ బదిలీలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదన పు ప్రధాన కార్యదర్శి బండి రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. స్పౌజ్ బదిలీల్లో ఎస్జీటీ ఉపాధ్యాయుల కు అవకాశం కల్పించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. జిల్లాలో కేవలం 27 మంది ఎస్జీటీ స్పౌజ్ కో టాలో దరఖాస్తు చేసుకుంటే తగినన్ని ఖాళీలు ఉన్నప్పటికీ కూడా జిల్లాలోకి అనుమతించకపోవటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు సొంత జిల్లాకు వచ్చేందుకు అవకాశం ఇవ్వాలన్నా రు. బదిలీల షెడ్యూల్ పూర్తిగా ప్రారంభం కాకముందే దొడ్డిదారిన ఇష్ట కౌన్సెలింగ్ విధానాన్ని అపహస్యం చేయటాన్ని తప్పుబట్టారు. ఈపై రవీ బది లీలను నిలిపివేయాలన్నారు. స్పౌజ్ ఉపాధ్యాయులకు గతంలో బ్లాక్ చేసిన 12 జిల్లాల్లోకి కొంత మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు ఉపాధ్యాయులకు అ వ కాశం ఇవ్వటంపై పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కా ర్యదర్శి గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా స్పౌజ్ బదిలీలకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం


మంటలు ఆర్పివేస్తున్న రైతులు

భీమిని: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు ఇందూరి మహేష్ తన చేనులో పండిన సుమారు 250క్వింటాళ్ల పత్తికి ధర లేకపోవడంతో ఇంటి వద్ద ఉంచుకున్నాడు. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా సుమారు 15క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. దీంతో రూ.లక్షా 50వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. సంఘటనా స్థలాన్ని కన్నెపల్లి ఎస్సై సురేష్ పరిశీలించి షార్ట్ సర్క్యూటా? ఎవరైనా నిప్పంటించా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్ల సమస్యలు తీర్చాలి


ఏవో సురేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

పాతమంచిర్యాల: కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏవో సురేష్‌కువినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తోకల తిరుపతి మాట్లాడారు. కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల వేతనాలు రూ.26000 లకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, కేర్ టేకర్‌లను నియమించాలని, ఏఎన్ఎంలకు రోస్టర్ పద్ధతిలో నైట్ డ్యూటీలు వేయాలని, కొత్తగా నియమితులైన అకౌంటెంట్‌లకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. పాఠశాల నుంచి కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన కేజీబీవీ పాఠశాలలకు అదనపు సిబ్బంది కేటాయించాలన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి, సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు శ్రీలత, మౌనిక, అరుణ, పద్మ, తిరుమల, లక్ష్మీ, శారద తదితరులు పాల్గొన్నారు.

63 రోజుల ముందే లక్ష్యం పూర్తి


వివరాలు వెల్లడిస్తున్న ఏజెంట్, మేనేజర్లు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 6 గని వార్షిక ఉత్పత్తి లక్ష్యం నూరు శాతం ముందే సాధించింది. గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ తిరుపతి శుక్రవారం గనిపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 1.8 లక్షల టన్నులు కాగా దీనిని మార్చి 31, 2023 నాటికి సాధించాల్సి ఉండగా 63 రోజులు ముందుగానే సాధించినట్లు తెలిపారు. కంపెనీలోని 24 భూగర్భ గనుల్లో కంటే ముందే వార్షిక లక్ష్యం సాధించిన గనిగా రికార్డు నెలకొల్పామన్నారు. ఇది సమష్టి కృషితోనే సాధ్యమైందని వివరించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించడం జరిగిందన్నారు. వచ్చే 2023–24 ఆర్థిక సంవత్సరానికి 1.8 లక్షల టన్నులుగా ఉందన్నారు. గనిలో ప్రస్తుతం 1100 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. 1.02 ఓఎంఎస్ నమోదైందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని సేఫ్టీ అధికారి కాదాసు శ్రీనివాస్, ఇంజినీర్ మహేశ్ పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో వ్యక్తిపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న సత్తార్

రామకృష్ణాపూర్: మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో ఒకరిపై ఐదుగురు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. గురువారం అర్ధరాత్రి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మందమర్రి సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ... కాగజ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సత్తార్ కొంతకాలంగా స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలోని దర్గా నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మంత్రాలు చేస్తూ అదే ప్రాంతానికి చెందిన పలువురు అనారోగ్యానికి కారణమవుతున్నాడని, అలాగే కొంతమంది మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పట్టణానికి చెందిన బుడిగె వంశీ, ప్రకాష్, రవి, సాయి అనే నలుగురితో పాటు దర్గాకు ఆనుకునే ఉన్న స్థలం విషయంలో గతంలో సత్తార్‌తో గొడవపడిన బీజేపీ నాయకుడు పాలరాజయ్య కలిసి దర్గాలో నిద్రిస్తున్న సత్తార్‌పై ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలైన సత్తార్‌ను కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఐదుగురిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు


- సుమారు రూ.లక్షా 85వేల విలువైన బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాగజ్‌నగర్ డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న కాగజ్‌నగర్ డీఎస్పీ

సిర్పూర్(టి): జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న యువకుడిని పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. సిర్పూర్(టి) జీపీ శివాపూర్ గ్రామానికి చెందిన దోని గోపి కొంత కాలంగా సిర్పూర్(టి)లోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల పట్టణంలోని సత్యనారాయణ ఇంట్లో 24.5 గ్రాముల నెక్‌లెస్, చెవి కమ్మలు, ముక్కు పుడక అపహరించగా, కొతూతరి బుజ్జి ఇంట్లో 12 తులాల బంగారం దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. అలాగే దొంగిలించిన సుమారు రూ.లక్షా 85వేల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న కౌటాల సీఐ బుద్దేస్వామి, సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేష్‌లను అభినందించారు.

ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా ధాబా

- జెడ్పీ సీఈవో రత్నమాల


రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో రత్నమాల

వాంకిడి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ధాబా గ్రామాన్ని ఉమెన్ ఫ్రెండ్లీ (మహిళా స్నేహ పూర్వక) గ్రామ పంచాయతీగా ఎంపిక చేసినట్లు జెడ్పీ సీఈవో రత్నమాల తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ధాబా గ్రామపంచాయతీని ఆమె సందర్శించి మాట్లాడారు. మహిళా స్నేహ పూర్వక పంచాయతీగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మహిళా సాధికారతకు సంబంధిత ప్రణాళికను గ్రామ సభ ద్వారా గ్రామస్తుల సమక్షంలో తయారు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని మహిళలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో శివకుమార్, ధాబా కార్యదర్శి ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భానుమతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుంచి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో నోడల్ అధికారి హేమసత్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, చట్ట బద్దత సౌకర్యాలు లేక చాలా నష్టపోతున్నారన్నారు. జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రాజమణి, అంగన్‌వాడీ వర్కర్‌లు శంకరమ్మ, అనురాధ, రాజేశ్వరి ఉన్నారు.